21. నేరం

అప్పటికే ఆ పెట్టెలో మనిషి మీద మనిషి నిలబడి వున్నారు. బండి స్టేషన్‌లో ఆగగానే ఒక స్థూలకాయుడు మెల్లిగా లోనికి ఎగబాకాడు. తలుపు దగ్గర నిలబడ్డ జనం "చోటులేదు" అని ఎంత గోలచేస్తున్నా వినిపించుకోకుండా, భుజబలంతో తోసుకుంటూ లోనికి దూరాడు.

లోపల బనీనుకనిపించే సిల్కు చొక్కా, గ్లాస్కో పంచా, జరీ అంచుల ఉత్తరీయమూ కలవాడేనని సూచిస్తున్నా, నల్లని తుమ్మమొద్దులాటి శరీరచ్ఛాయా, నిప్పుకణాల్లాటి కళ్ళూ, పైకి ఎగదువ్విన క్రాపూ, టూత్ బ్రష్‌కు పనికివొచ్చే మీసపుకట్టూ, సంస్కారరహితమైన ప్రవర్తనా - ఇవన్నీ చూసి కూడా, "ఇది ఇంటర్‌క్లాసు!" అని తెలియజెప్పే సాహసం ఆ పెట్టెలో ఎవ్వరికీ లేకపోయింది. బహుశా నల్లవాణ్ని పోలిన మనుషులే మరికొందరు, సంస్కారపు బురఖాతో ఆ పెట్టెలో ఉండివుంటారనేందుక్కూడా సందేహం లేదు!

వొచ్చినవాడు అందరిలాగే నిలబడకుండా, ఏమేమో గొణుక్కుంటూ ఒక ముసలాయన్ను "జరగవయ్యా!" అన్నాడు, కఠోర కంఠధ్వనితో.

నలుగురు కూర్చోవాల్సిన చోటులో అప్పటికే ఆరుగురు కూర్చొనివుండటంవల్ల, "ఇక్కడ చోటులేదు" అన్నాడు ముసలాయన.

నల్లవాడు వినిపించుకోకుండా, ఇక మాటల్తో పని జరగదని కాబోలు చప్పున ఆయన మీదనే కూర్చున్నాడు. స్థూలకాయుడవటంవల్ల నల్లవాడి బరువు సగానికిపైగా పక్కనే వున్న మిలిటరీ వాడిమీద పడ్డది. ముసలాయన 'కుయ్యో'మన్నాడు. మిలిటరీవాడు బలంగా నల్లవాణ్ని ఒక్కతోపు తోసి, "నీకేమన్నా బుద్ధివుందా?" అన్నాడు.

"బుద్ధిలేకపోతే మిలిటరీలోనే జేరేవాణ్ని!" అన్నాడు నల్లవాడు.

మిలిటరీవాడు కోపంతో కొట్టేందుకు చెయ్యి ఎత్తేలోపలే, నల్లవాడిగుప్పిట బలాన్ని చవిచూడక తప్పిందికాదు. ఒక్క క్షణంలో ఇద్దరూ కలియబడ్డారు. ఆ చుట్టుపక్కల కూర్చున్న ప్రయాణికులు వెంటనే యీ ఉపద్రవాన్ని గుర్తించి, తమతమ సామానుల్ని జాగర్తగా సర్దుకొని, తమ కాళ్ళను సీటు మీదకు ఎత్తిపెట్టుకొని, ఆతృతతో యీ వినోదాన్నిచూసి ఆనందించసాగారు. వాళ్ళిద్దర్నీ సర్దాల్సిన తమ ధర్మాన్ని ఒక్కరూ గుర్తించలేదు. ఒకవేళ గుర్తించినా, ఆ సాహసంలేక, "మన కెందుకులే!" అని ఊరుకొనన్నా వుంటారు.

రైలుకదిలింది. గొలుసు లాగితే ఎంత తమాషాగా బండి ఆగుతుందో చూడాలనీ, రైలుమొత్తాన్నే ఆపగలిగిన తమ భుజబలాన్ని ఇతర్లు మెచ్చుకోగా వినాలనీ కుతూహల పడుతూన్న ఇద్దరు కాలేజీ స్టూడెంట్స్, ఆ పనికి పూనుకునే లోపలే- ఆపద్బాంధవుడిలా రైల్వేకానిస్టేబిల్ ఆ పెట్టెలో జొరబడ్డాడు. ఈ పోట్లాట తన ప్రాణానికే వొచ్చినట్టు ఒక్క క్షణం అనుమానించి, బండి వేగం హెచ్చినందువల్ల దిగి ఇంకో పెట్టెలో ఎక్కే అవకాశం పోయినందుకు నిట్టూర్చి, ఇక తనకు తద్దినమన్నట్టు జనాన్ని తోసుకుంటూపోయి, "ఏయ్! ఏమిటిది?... ఆగండి" అని గద్దించి, ముఖ గాంభీర్యంతో ఎలాగో వాళ్ళిద్దర్నీ విడదియ్య గలిగాడు.

వెంటనే జేబులోంచి నోట్‌బుక్ తీస్తూ, నల్లవాణ్ని ఉద్దేశించి, "నీ పేరేంటీ?" అన్నాడు.

"నా పేరెందుకోయ్?"

"తాగి గోలచేస్తున్నందుకు."

"ఏం తాగుతే?" అని తృప్తికరంగా తను తాగినట్టు సూచించేందుకు ఒకసారితేపి, "మేమిద్దరమూ కుస్తీపడుతూంటే- మధ్య నువ్వెవడివిరా?" అని తూలిపడబోయి, పైనిచెక్కను పట్టుకొని, నిలవదొక్కుకున్నాడు.

"స్టేషన్ రానీ- నీ పని పడతా!" అని పోలీసు మీసం దువ్వాడు, ఇక్కడ తనకు బలంలేనందుకు లోలోపల విచారపడి వుంటాడు.

కాస్తఆగి, "నీ టిక్కెట్టు ఏదీ?" అన్నాడు పోలీసువాడు కొత్తమార్గాన్ని ఆలోచించి.

"నన్నెవడ్రా టిక్కెట్ అడిగేది? ముందు నీ టిక్కెట్ ఏదీ?"

"చూపిస్తాలే - ఆగు!"

పోలీసువాడి ముఖం రోషంతో ఎర్రబడ్డది. ఇంతవరకూ జరిగిన కథ నంతట్నీ విని, క్షుణ్ణంగా జీర్ణించుకున్నాడు - పోలీసువాడు.

ఇంతలోకే స్టేషన్ రావటంవల్ల బండి ఆగింది. అది జంక్షన్ కావటంవల్ల- పోలీసువాడు, ఇంకో పోలీసువాడి సహాయంతో నల్లవాణ్ని బలవంతాన స్టేషన్‌కు లాక్కుపొయ్యాడు. జనసమూహం యీ వింతను చూసేందుకు రైల్వే పోలీసుస్టేషన్

ముందు గుమికూడారు. అసలు విషయం ఎవ్వరికీ తెలియకపోయినా, జేబు దొంగతనమై వుంటుందని వూహించి, ఆ కథనే తమలోతాము ప్రచారం చేసుకోసాగారు!

ఆ పెట్టెలో ప్రయాణంచేసే ఇద్దరి దగ్గర్నుంచి–నల్లవాడు తాగిగోల చేస్తూ, వృథాగా ప్రయాణికుల్ని కొట్టబొయ్యాడని సాక్షి స్టేట్‌మెంట్లు తీసుకోబడ్డవి.

బండి బయలుదేరేందుకు గంటకొట్టగానే జనమంతా వెళ్ళిపోయారు. పోలీసువాడి డ్యూటీ యీ స్టేషన్‌తో ఐపోవటంవల్ల, బండిని సాగనంపేందుకు వొచ్చి, తన శూరత్వాన్ని చూడమన్నట్టు తలెత్తి నిలబడ్డాడు. రైలుమాత్రం ఇదేమీ తనకు పట్టనట్టు మామూలుగా సాగిపోయింది.

బండి వెళ్ళగానే నల్లవాణ్ని మెత్తగా తన్నారు. కాని, నల్లవాడు నిషాలో ఒళ్ళు తెలియని స్థితిలో వుండబట్టి ఆ దెబ్బల్ని పూర్తిగా అనుభవించలేక పొయ్యాడు. తన్ను తన్నుకూ చావబొయ్యే కుక్కలాగా సన్నగా, జాలిగా మూలిగాడు. చివరకు పోలీసులకు విసుగెత్తి, జైలు తలుపు తాళాం వేశారు.

అర్ధరాత్రికల్లా నల్లవాడికి నిషా పూర్తిగా దిగిపోయింది. గత సాయంత్రం తిన్న దెబ్బల మజా బాగా తెలిసివొచ్చింది. అతని ఆకలి విజృంభించింది. ఇది ఇంకా రైలుపెట్టేనని నిద్రకళ్ళతో గ్రహించాడు.

"ఎవడ్రా?".... ఎవడ్రా?" అంటున్నాడు.

"ఉస్......మాట్లాడవోక.... పడుకో!"

నల్లవాడు లేచి కూర్చొని కళ్లు తుడుచుకున్నాడు. ఆ మెలుకువలో ముందున్న ఇనుపచువ్వల్ని చూసి, ఇది జైలని వెంటనే గ్రహించాడు.

"కాసిని మంచినీళ్ళివ్వు బాబూ!"అన్నాడు ప్రార్థనాస్వరంతో. తన బాహుబలమూ, దబాయింపూ ఏమీ లాభంలేదని గ్రహించేందుకు వాడికి ఎంతోసేపు పట్టలేదు. బైటినుంచి జవాబు లేదు.

"అబ్బ! దాహం! మంచినీళ్ళు... స్వామీ! మంచినీళ్ళు!..."

"అర్ధరాత్రి – ఏంటోయ్... పడుకో" అన్నది కాపలావాడి కంఠం.

"పీకె ఎండి చస్తాను."

"చావు!" జైలు పాడుపెట్టాల్సివొస్తుందన్న భయమన్నా కాపలావాడికి లేదు!

"బాబూ! కాస్త పుణ్యం కట్టుకో."

తెల్లవార్లూ యీ గోలతో నిద్రపట్టదని, కాపలావాడు విసుక్కుంటూ లేచి మంచినీళ్ళు ఇచ్చాడు.

"బాబూ! ఆకలవుతోంది."

"ఇక్కడ తినేందుకేమీ లేవు."

"నా దగ్గర డబ్బులున్నయ్."

డబ్బుమాట వినగానే కాపలావాడి ముఖం వికసించింది.

"సరే... తే" అన్నాడు.

నల్లవాడు ఐదురూపాయిల నోటుఇచ్చాడు. కాపలావాడు పళ్ళూ, ఫలహారాలూ తెచ్చాడు. నల్లవాడు అవి తిని ఆకలి తీర్చుకున్నాడు. నల్లవాడు డబ్బు లెఖ్ఖ అడగనూ లేదు, కాపలావాడు చెప్పనూలేదు. అదీ మర్యాద!

దెబ్బలబాధను నల్లవాడు భరించలేకపోతున్నాడు.

"బాబూ! ఆ మిలిటరీ వెధవ వొళ్ళంతా నలగబొడిచినట్టున్నాడు."

"పడుకోవయ్యా!" అన్నాడు కాపలావాడు విసుగ్గా.

"నన్ను ఎప్పుడు వొదిలిపెడతారూ!"

"రేపు మేజిస్ట్రేటు కోర్టులో శిక్ష వేశాక!"

"మళ్ళీ జైలా! బాబూ!" అని నల్లవాడు తన దురదృష్ట దేవతకు ఏడుస్తూ దండకాన్ని పఠించసాగాడు.

"ఏంటయ్యా యీ గోల?"

"ఏం చెయ్యమంటావూ? దగ్గర్లో ఎక్కడన్నా కాస్త మందు దొరికితే?"

"మందేమిటి నీ తలకాయ?"

"బ్రాందీ, బీరూ, కనీసం సారాయీ - నా దగ్గర డబ్బులున్నయ్‌లే మనిద్దరమూ తాగి హాయిగా పడుకుందాం -"

"ఎంత వుందయ్యా?"

"డెబ్బైదాకా వుంది."

"ఏం చంపుకుతింటున్నావయ్యా! ఉండు మన వాళ్ళను పిలుస్తాను."

ఐదునిమిషాల్లో ఐదుగురు కానిస్టేబిల్స్ వొచ్చారు. అందరూ తమకు జరగబొయ్యే విందును అనుభవించేందుకు ఆనందంతో వున్నారు.

ఇంకో పదినిమిషాల్లో నల్లవాడూ, ఆరుగురు బేడ్రెస్సు పోలీసులూ కలిసి, స్పెన్సర్‌లో ఎలక్ట్రిక్ ఫాన్ కింద, గొంతుదాకా రొట్టెలుతింటూ కూర్చున్నారు.

"ఒరేయ్! నూటపదిహేడూ! ఎక్కడ చచ్చార్రా వెధవలు!"

అందరూ అదిరిపడ్డారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ స్టేషన్‌బైట నిలబడి, ప్లాట్ ఫారమంతా దద్దరిల్లేట్టు రంకెలు పెడుతున్నాడు. నూటపదిహేడుగాడు ముందుకు పరుగెత్తాడు.

నల్లవాడు స్పెన్సర్ బిల్లు యాభై ఎనిమిది రూపాయిలూ చెల్లించాడు. మిగతావాళు నల్లవాణ్ని తీసుకొని స్టేషన్ వైపు బయలుదేరారు.

"ఎక్కడ చచ్చార్రా?" అన్నాడు సబ్ ఇన్‌స్పెక్టరు.

"నల్లవాడు పార్టీచేశాడు సార్! మిమ్మల్ని పిలుద్దామంటే నిద్రపోతున్నారు."

"ఎవడ్రా వీడు?"

"ఫిఫ్టీపోర్‌లో తప్పతాగి రైలుపెట్టెలో న్యూసెన్స్ చేశాడు సార్ !"

"అంతా వొదిలించారా?"

"ఇంకా ఉన్నట్టుంది సార్!"

"ఉంటే చూస్తావేరా వెధవా! నిద్రపట్టక ఛస్తూంటే..."

"ఆఫీసరుగారికి బుడ్డి తెప్పించు" అన్నాడు కాపలావాడు, అధికార స్వరంతో.

"నాదగ్గర ఇంకా పదమూడు రూపాయిలే ఉన్నాయ్. నేను రేపు బెజవాడ పోవాలి."

"రేపు మేజిస్ట్రేటు కోర్టులో అది వొదిలి, జైలుకు వెళ్తావ్"

మేజిస్ట్రేటు కోర్టుమాట వినేటప్పటికి నల్లవాడి గుండెలు జారినై. లోగడ దాని అనుభవం బాగా ఉండివుంటుంది.

"తే.... అంతా తే!" అన్నాడు కాపలావాడు. మరి గత్యంతరం లేక నల్లవాడు జేబంతా దులిపాడు. స్పెన్సర్ నుంచి బుడ్డి రాగానే, సబ్ ఇన్‌స్పెక్టర్ అడిగాడు "వీడిమీద డైరీ రాశారా?"

"నూటపధ్నాలుగు పట్టుకున్నాడు సార్.... డైరీ రాయలేదు."

"సరే... ముందు వీడ్ని స్టేషన్ బైటిదాకా సాగనంపి రండి."

"ఈ ఊరు నాకు కొత్త. ఇక్కడ పడుకోనీండి రేపు ఊరువెళ్ళేందుకు నా దగ్గర డబ్బుల్లేవు" అని నల్లవాడు గోలపెడుతున్నా వినకుండా, ఇద్దరు పోలీసువాళ్ళు వాడ్ని స్టేషన్ పొలిమేరల్లో కూడా లేకుండా నెట్టి, చేతులు దులుపుకున్నారు.

సబ్‌ఇన్‌స్పెక్టరు బుడ్డి ఖాళీచేసి, నిషాలో రంకెలు వేయసాగాడు. మిగతా పోలీసులు కూడా ఆ ఆనందంతో తమలో తాము వేళాకోళాలు ఆడుకొని, విసుగెత్తి స్టేషన్ అంతా దద్దరిల్లేట్టు రాంభజన మొదలుపెట్టారు.

ముసలి స్టేషన్ మాస్టరూ, చాలామంది ప్రయాణికులూ, స్టేషన్‌చుట్టూ మూగారు.

"ఏమిటీ న్యూసెన్స్," అన్నాడు స్టేషన్‌మాష్టరు.

కాని పోలీసువాళ్లెవరూ జవాబు చెప్పలేదు. వాళ్ళ రాంభజన క్లయిమాక్స్‌లో వుంది కనుక, అసలు వినిపించుకోనేలేదేమో!

ఇద్దరు పోలీసులు దేహారోగ్యం కోసం కుస్తీపడుతున్నారు. ప్రేక్షకులు ఆశ్చర్యంతో అలాగే నిలబడిపొయ్యారు.

– డిశంబర్, 1946